క్లుప్తంగా

పీఏసీఎస్ సీఈఓగా చంద్రశేఖర్



కరప: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓగా ఎస్‌జీ చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెదపూడి మండలం అచ్యుతాపురత్రయం పీఏసీఎస్ సీఈఓగా పనిచేస్తూ కరప సొసైటీకి బదిలీపై వచ్చినట్టు ఆయన తెలిపారు. కరప పీఏసీఎస్‌కు ఇంతవరకూ ఇన్‌చార్జి సీఈఓగా పనిచేస్తున్న రాయుడు వెంకటేశ్వరరావు నుంచి ఆయన చార్జి తీసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ సకాలంలో దీర్ఘ, స్వల్పకాలిక పంట, ఇతర రుణాలు అందజేస్తామని ఆయన అన్నారు.

పేదలకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ పూర్వ విద్యార్థులు

బాలాజీచెరువు: లయన్స్ క్లబ్ కాకినాడ హాల్లో గురువారం బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా 85 మంది పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ప్రాజెక్టు ద్వారా కొన్ని వేల మందికి సేవ చేయడం సంతోషదాయకమన్నారు. తమ ఇంటి వద్ద నిరుపయోగంగా ఉన్న కళ్లజోళ్లు, వస్త్రాలు తమకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ, లయన్ జీఎల్ జగన్నాధరావు, డి.రామసుబ్రహ్మణ్యం, పులవర్తి కుమార్, శ్రీనివాస్, జరినా పాల్గొన్నారు.

గుప్త నవరాత్రులు ప్రారంభం



పాముగుంట వద్ద వారాహి అమ్మవారు

కాకినాడ రూరల్: వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులు కాకినాడ రూరల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడీబీ రోడ్డును ఆనుకుని తమ్మవరం గ్రామ పరిధిలో పాముగుంట జంక్షన్ వద్ద ఐశ్వర్య వారాహి ధర్మక్షేత్రంలో వంటిద్దు గంగాప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, అమ్మవారి దీక్షలు ప్రారంభమయ్యాయి. రమణయ్యపేట ఏపీఎస్పీ సమీపంలో హ్రీం పీఠంలో నిర్వాహకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో వారాహి గుప్త నవరాత్రులు నిర్వహించారు. హోమం, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు పూజలు

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ వద్ద నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి సీబీ రావు దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈఓ వీర్రాజు అమ్మవారి ప్రసాదం అందించారు.

సూర్యారావుకు విశిష్ట ప్రతిభారత్న పురస్కారం



విశిష్ట ప్రతిభారత్న పురస్కారం అందుకుంటున్న తురగా సూర్యారావు

బోట్‌క్లబ్: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం కాకినాడకు చెందిన నటుడు, సామాజికవేత్త తురగా సూర్యారావుకు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారు విశిష్ట ప్రతిభారత్న పురస్కారం అందించారు. మండడి కృష్ణారెడ్డి, ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు ఈఎస్ నారాయణ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. సూర్యారావును నగరానికి చెందిన పలువురు కవులు, నటులు అభినందించారు.

హుండీల ఆదాయం లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. 90 రోజుల వ్యవధికి రూ. 9.29 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ సత్యవాణి తెలిపారు. హుండీల లెక్కింపులో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మా అమ్మాయి ఆచూకీ తెలపండి

రాజానగరం: 14 ఏళ్ల తమ అమ్మాయి ఈ నెల 8వ తేదీ నుంచి కనిపించడం లేదని, ఎవరో కిడ్నాప్ చేశారని అనుమానంగా ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కాకినాడ జిల్లా కరపకు చెందిన ఆ బాలిక తల్లిదండ్రులు మొరపెట్టుకున్నారు. దివాన్ చెరువులోని ప్రాంతీయ అటవీ పరిశోధన కేంద్రం వద్ద స్టేట్ ఫారెస్ట్ అకాడమీ ఏర్పాటుకు శంకుస్థాపన చేసేందుకు గురువారం వచ్చిన ఆయనకు ఈ విషయం విన్నవించారు. రాజస్థాన్ నుంచి వచ్చి 18 ఏళ్లుగా కరపలో ఉంటున్నామని, అదే గ్రామానికి చెందిన బుద్దాల మణికంఠపై అనుమానం ఉందన్నారు.

ఉద్యానం... అధ్వానం

- సమస్యలతో బోట్‌క్లబ్ పార్కు
- పారిశుధ్య నిర్వహణ గాలికి..
- పాడైన క్రీడా పరికరాలు



పార్కులో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ప్రమాదకరంగా ఉన్న తీగలు



బోట్ క్లబ్ ఉద్యానం ముఖద్వారం



సందర్శకులు కూర్చునే చోటనే కుక్క

బోట్‌క్లబ్: పేరుకే ఉద్యానం... ఇక్కడకు వెళ్లేవారికి ఎదురయ్యేది మాత్రం సమస్యలతో సతమతం. ఉరుకులు పరుగుల జీవితంలో కాసేపు సేద తీరడానికి ఉన్న స్థానిక బోట్‌క్లబ్ పార్క్ సమస్యలతో స్వాగతం పలుకుతోంది. చిన్నారులు ఆడుకునే క్రీడా పరికరాలు పాడై నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. పార్కులో పారిశుధ్య నిర్వహణ మరీ అధ్వానంగా తయారైంది. ఇక్కడ ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ఎప్పుడో వారం పది రోజులకు ఒకసారి పార్క్‌ను శుభ్రం చేసి, ఆపై అక్కడ చెత్తను మాత్రం తరలించకుండా గుట్టలుగా వేసి తగలబెడుతున్నారు. దీంతో పార్కుకు వచ్చే సందర్శకులకు పొగ కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. పార్కుకు ఉదయం, సాయంత్రం సుమారు పది వేల మందికి పైగా ప్రజలు వస్తుంటారు. గత ప్రభుత్వ హయంలో ఈ పార్క్ ఎంతో సుందరంగా ఉండేది. రోజూ పారిశుధ్య సిబ్బంది ఇక్కడ చెత్తను తరలించేవారు. చిన్నారులు, పెద్దలు హాయిగా సేదతీరేందుకు వచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పార్కు అధ్వానంగా తయారైంది. ఇక్కడ పాడైన వస్తువులకు మరమ్మతులు చేయించకపోవడంతో సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పార్కులో సుమారు 20కి పైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయి, పడిపోయాయి. వాటికి కనీస మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు. పలు విద్యుత్ స్తంభాల వద్ద విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఎవరైనా చిన్నారులు తెలియకుండా అక్కడకు వెళితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కానీ కార్పొరేషన్ అధికారులు మాత్రం ఇవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పార్కులో చెత్త పేరుకుపోవడంతో విష జంతువులకు ఆవాసాలుగా మారిపోయాయి. దీంతో తెల్లవారు జామున సాయంత్రం వేళలో పార్క్‌లో వాకింగ్ కోసం వచ్చేవారు భయపడుతున్నారు. ఇక్కడ కుక్కలు సైతం యథేచ్ఛగా తిరుగుతున్నాయి. పార్కులో ఉన్న బెంచీలపై అవి నిద్రిస్తున్నాయి. వాకింగ్‌కు వచ్చే మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కుక్కలు పార్కులోకి రాకుండా సెక్యూరిటీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు. పార్కులో ఉన్న బాత్‌రూమ్స్ అధ్వానంగా ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఎవరైనా అక్కడకు వెళ్తే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం అక్కడ నీటి సదుపాయం కూడా లేకపోవడంతో వాకింగ్ వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన రాకుండా ఎటువంటి చర్యలు కూడా తీసుకోవడం లేదు.

చీకటైతే మందుబాబులకు అడ్డాగా..

పార్కులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయినా, వాటికి మరమ్మతులు చేయకపోవడంతో చీకటి పడితే అక్కడ అంధకారం నెలకొంటుంది. అక్కడ మందుబాబులు చెలరేగిపోతున్నారు. పూటుగా మద్యం తాగి ఖాళీ మద్యం సీసాలను అక్కడే వదిలేస్తున్నారు. వాకింగ్ చేసే ప్రాంతంలో కొందరు మద్యం సీసాలను పగలకొట్టి వేస్తున్నారు. దీంతో వాకర్స్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పార్కులో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా వారికి ఇవేమీ పట్టడం లేదు.

సీసీ కెమెరాలు ఎక్కడో!

పార్కులో సీసీ కెమెరాలు ఉన్నా ప్రస్తుతం అవి పని చేయడం లేదు. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాగా తయారైంది. సీసీ కెమెరాలు పనిచేస్తే రాత్రి సమయాల్లో మందుబాబులు వస్తే గుర్తించి వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయక ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

శుభ్రత ఉండడం లేదు..



సాయంత్రం వాకింగ్ వస్తుంటాను. పార్కు చాలా అధ్వానంగా ఉంది. చెత్తను తగులబెట్టడంతో పొగ వాకింగ్ చేసేటప్పుడు కళ్లలోకి వస్తుంది. పది రోజులకు ఒకసారి ఇలాగే చేస్తున్నారు. చెత్తను తగలబెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. బాత్‌రూమ్‌లు కూడా శుభ్రంగా ఉండడం లేదు. దుర్వాసన వెదజల్లుతున్నాయి. వాటిని శుభ్రం చేయాలి.

–నున్న సత్యనారాయణ, వాకర్

జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలి



పార్కులో రమణయ్యపేట వైపు ఉన్న జిమ్ పరికరాలు ఇటీవల తొలగించారు. దీంతో వాకర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండువైపులా జిమ్ పరికరాలు ఉండడంతో ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. కార్పొరేషన్ అధికారులు తొలగించిన జిమ్ పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలి.

–పిడుగు సూర్యనారాయణమూర్తి, వాకర్

డ్రగ్స్‌పై సమాచారం ఇస్తే బహుమతి: కలెక్టర్



అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ్ ఆధ్వర్యంలో అతిథులను సత్కరిస్తున్న సభ్యులు



నగరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ క్రైం: స్థానికంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ బిందుమాధవ్ అధ్యక్షతన మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. దీనిని కలెక్టర్ షణ్మోహన్ ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి భానుగుడి కూడలి వరకూ ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం కూడలిలో సమావేశం నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై సమాచారం ఇచ్చిన వారికి బహుమతులు ఇస్తామన్నారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ, డ్రగ్స్ కేసులో పట్టుబడితే ఉద్యోగ, విదేశీ అవకాశాలు కోల్పోతారన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, డీఎంహెచ్ఓ నరసింహ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బాలాజీచెరువు: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని త్రీ టౌన్ సీఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశలో కేవలం విద్య, ప్రణాళికలపై మాత్రమే ఆలోచన ఉండాలని, చెడు అలవాట్లకు గురై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు క్లబ్ చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించి, ఇటువంటి వాటిలో యువత ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. క్లబ్ పూర్వ గవర్నర్ కె.మునిరెడ్డి మాదక ద్రవ్యాలతో వ్యక్తిగత, సామాజిక జీవితాల్లో వచ్చే నష్టాలను వివరించారు. క్లబ్ వ్యవస్థాపకులు దిలీప్‌కుమార్ సదానాని మాట్లాడుతూ సమాజం పట్ల సామాజిక బాధ్యతలు విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం క్లబ్ తరఫున అతిథులను సత్కరించారు. క్లబ్ కో–ఆర్డినేటర్ రవి శంకర్ పట్నాయక్, అడ్వకేట్ సునీల్‌కుమార్, యూజీసీ కోఆర్డినేటర్ పసుపులేటి హరిరామప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని న్యాయవాది యనమల రామం అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక బోట్‌క్లబ్ ఉద్యానంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే చదువు, ఆరోగ్యం, ఏకాగ్రత దెబ్బతింటాయన్నారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి దాసరి శ్రీధర్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, సూర్యనారాయణ, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

కాకినాడ రూరల్: సూర్యారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై మెరైన్ పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయాలు చేపడితే టోల్ ఫ్రీ నంబరు 1972కు తెలపాలని కోరారు. హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: స్థానిక అన్నవరం సత్యవతీదేవి (ఏఎస్‌డీ) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ మరియు ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. అనంతరం నగరంలో అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సువర్చల, డబ్ల్యూసీ కన్వీనర్ కె.ఝాన్సీ, నషా ముక్తా అభియాన్ కన్వీనర్ పి.లీనా పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: కాకినాడ మూడో బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కమాండెంట్ నాగేంద్రరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని చెప్పారు. అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, యూనిట్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీరాం, లక్ష్మి, అసిస్టెంట్ కమాండెంట్ మన్మదరావు, బి.చంద్రశేఖర్, ఆర్ఐ రవిశంకర్ పాల్గొన్నారు.

నీరు.. రంగు మారిన తీరు



వాకలపూడిలో రంగు మారి వచ్చిన కుళాయి నీరు

కాకినాడ రూరల్: రంగు మారిన నీరు తాగలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలోని గ్రామాలకు పండూరు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా తాగు నీటిని అందిస్తున్నారు. గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు పండూరు స్కీమ్ నుంచి నీటిని శుద్ధి చేసి పంపిణీ చేస్తున్నారు. పండూరు స్కీమ్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు అడుగంటి ఆకుపచ్చ రంగులో ఉండడంతో వాటినే పంపిణీ చేస్తున్నారు. ఏమాత్రం రంగు మారకుండా రావడంతో గ్రామాల్లో ఆ నీటిని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఇటీవల తిమ్మాపురంలో కుళాయిల ద్వారా ఆకుపచ్చ రంగులో నీరు రావడంతో ఆ గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా రెండు రోజులుగా వలసపాకల, వాకలపూడి గ్రామాలలో కుళాయి నీరు ఆకుపచ్చ రంగులో వస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగు మారడంతో పాటు ఒక్కోసారి తోక పురుగులూ వస్తున్నాయని వలసపాకల సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఫర్నిచర్ వ్యాపారి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. రంగు మారిన నీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ మారుతిరావును వివరణ కోరగా స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు అడుగంటిందన్నారు. శుద్ధి చేసినా రంగు ఆకుపచ్చగానే ఉంటుందని, కాల్వల ద్వారా నీరు విడుదల చేయగా డైరెక్టగా పంపింగ్ చేపట్టి లోగా స్టోరేజ్ ట్యాంక్ నీటిని బయటకు తోడేసి శుభ్రం చేస్తామన్నారు.

మినిస్టీరియల్ ఉద్యోగులకు స్థానచలనం

కాకినాడ క్రైం: రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాల మేరకు స్థానిక జీజీహెచ్‌లో మినిస్టీరియల్ ఉద్యోగుల సీట్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. గురువారం స్థానిక జీజీహెచ్‌లో పనిచేస్తున్న 30 మంది మినిస్టీరియల్ సిబ్బంది సీట్లు మారుస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆదేశాలిచ్చారు. ఇందులో 21 మంది జూనియర్ అసిస్టెంట్లు, 9 మంది సీనియర్ అసిస్టెంట్లు స్థాన చలనం పొందారు. సీట్ల మార్పుల నేపథ్యంలో గతంలో చోటు చేసుకున్న వివాదాలతో ఆసుపత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. మార్పుల విషయాన్ని ముందుగానే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నాయకులు సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. సీట్ల మార్పుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు సిబ్బందికి సూచించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు చోటు చేసుకుంటున్న స్థానచలనాలను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



కొంగోడులో పారిశుధ్య నిర్వహణపై మహిళలను అడిగి తెలుసుకుంటున్న డీపీఓ రవికుమార్

కరప: గ్రామాల్లో అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా రోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సూచించారు. మండల పర్యటనలో భాగంగా గురువారం ఆయన డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావుతో కలసి కరప మండలం కొంగోడు, పెద్దాపురప్పాడు గ్రామాల్లో పర్యటించి, పారిశుధ్య పనుల నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి, కార్యదర్శులకు సూచనలిచ్చారు. గ్రామస్తులను కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి తడి, పొడి చెత్త తీసుకువెళ్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు తడి, పొడి చెత్త విడదీసి ఇవ్వాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును ఎలా తయారు చేస్తారో వివరించి, ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లో తక్కువ రేటుకు లభించే కంపోస్టు ఎరువుతో గృహాల్లో పూల మొక్కలు పెంచుకోవడానికి, కూరగాయలు పండించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు వెళ్లి, వాటి నిర్వహణను డీపీఓ రవికుమార్ పరిశీలించారు. గ్రామ కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుతో వ్యాధి నిరోధక శక్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కృష్ణమూర్తి

సామర్లకోట: గొర్రెలు, మేకలకు ప్రతి ఏటా నట్టల నివారణ మందు వేయిస్తే, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.కృష్ణమూర్తి అన్నారు. నట్టల నివారణ మందు పంపిణీ సందర్భంగా గురువారం స్థానిక మండల పశు వైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి సీజన్‌లో ఏడాదికి నాలుగు పర్యాయాలు ఉచితంగా గొర్రెలు, మేకల పెంపకందారులకు నట్టల నివారణ మందు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులు డాక్టర్ దినకర్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు పెంపకందారులు సంఘాలుగా ఏర్పడితే సహకార సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చన్నారు. అదే విధంగా పశువుల దాణా 50 శాతం రాయితీపై ఇస్తామని తెలిపారు. ఈ సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న జీవాల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ విధానాన్ని జిల్లా వ్యాధి నిర్ధారణ విభాగం ఉప సంచాలకులు డాక్టర్ కృష్ణజ్వాల వివరించారు. పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రమీళా, పశు వైద్యులు ఎం.భవాని, కిరణ్మయి, సౌమ్య, శివప్రసాద్, యశ్వంత్, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు గోలి వెంకట అప్పారావుచౌదరి, యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

29న బోనాల సంబరం

సామర్లకోట: నవర గ్రామంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి బోనాల సంబరం నిర్వహిస్తామని సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆలయ ధర్మకర్త దమ్మాల లక్ష్మణరావు తెలిపారు. ఆషాఢ మాసం, చవితిని పురస్కరించుకుని బోనాల సంబరం చేస్తున్నామన్నారు. మూడేళ్లుగా బోనాల సంబరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చెప్పారు. సర్పంచ్ దంపతులు బోనాలు ఎత్తుకుని ఉత్సవాన్ని ప్రారంభిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. బోనాలతో గ్రామం అంతా పర్యటించిన తరువాత ఆలయానికి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు.

బురద... ఏమిటీ వ్యథ




గోతులు పడి అధ్వానంగా ఉన్న ఇరు శాఖల ఉమ్మడి మార్గం



బురదమయంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయ ప్రవేశ మార్గం

కాకినాడ క్రైం: స్థానిక ఫైవ్ బిల్డింగ్స్ సెంటర్ పైడావారి వీధిలో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయ ఆవరణ పూర్తిగా బురదమయంగా మారింది. అదే ఆవరణలో ఉన్న ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మద్యం నమూనాల పరీక్షల కోసం ఓ ల్యాబొరేటరీ నిర్మాణం జరుగుతోంది. ఎక్సైజ్, ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంట్లు ఒకే ఆవరణలో ఉంటాయి. ఇరు శాఖల కార్యాలయాలను చేర్చే ఉమ్మడి మార్గం ఒకటుంది. ఆ దారిలో కొద్ది రోజులుగా నిర్మాణం కోసం భారీ వాహనాల్లో మెటీరియల్‌ను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, అధికారులను కార్యాలయాలకు చేర్చే ఉమ్మడి మార్గం పూర్తిగా ధ్వంసమైంది. గుత్తేదారు ఈ విషయాన్ని ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడం ఫుడ్ కంట్రోలర్ ఆఫీస్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందితో పాటు కార్యాలయానికి వివిధ అవసరాల కోసం వచ్చే సామాన్యులకు శాపంగా పరిణమించింది. మార్గం అధ్వానంగా మారుతున్నా కనీసం పట్టించుకోకపోవడంతో ఫుడ్ సేఫ్టీ శాఖ ఉన్నతాధికారులకు ఆగ్రహం తెప్పించింది. కార్యాలయంలోకి వచ్చే మార్గం పూర్తిగా ధ్వంసం కావడంతో ఇటీవల బదిలీ అయిన అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ కొద్దిరోజుల కిందట సీరియస్ అయ్యారు. దాంతో గుత్తేదారు తాత్కాలికంగా మెరుగులు దిద్దే క్రమంలో ఎర్రమట్టితో గోతులు పూడ్చారు. ఈ తాత్కాలిక చర్యలతో ఒరిగిందేమీ లేదు సరికదా పరిస్థితి మరింత దిగజారింది. సమూలంగా బురదమయమైన ఈ దారి ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తోంది. ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలోకి మార్గం పూర్తిగా లేకుండా పోయింది. ఆ మార్గం నుంచి వెళుతున్న ద్విచక్రవాహనాలు, కాలినడకన వెళ్లేవారు జారిపడుతున్నారు. అధికారుల కార్లు బురదలో దిగబడిపోతున్నాయి. ఫుడ్ టెస్టింగ్ మొబైల్ వాహనం కూడా ఆవరణ నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆహార తనిఖీలకు కూడా ఆటంకం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఆ శాఖను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మార్గాన్ని పునర్నిర్మించాలని అంతా కోరుతున్నారు.


సైనికుడు వినోద్‌కు ఘన సత్కారం



సైనికుడు వినోద్‌ను అభినందిస్తూ ర్యాలీ

సామర్లకోట: ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో పాల్గొన్న పెద్దాపురం పట్టణానికి చెందిన దడాల సుబేదార్ వినోద్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు అధ్యక్షతన ఆయన స్వగృహంలో సన్మానం జరిగింది. ఈ సందర్భంగా సభా ప్రదేశానికి వచ్చిన సుబేదార్ వినోద్‌కు ఘన స్వాగతం పలికారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని మొదటిసారిగా సొంత పట్టణానికి వచ్చి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సూరిబాబు రాజు తెలిపారు. భారత్ మాతాజీ జై అంటూ సభా ప్రాంగణం మార్మోగింది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

• ముసురేసింది..



కాకినాడ మూడో డివిజన్‌లో వర్షానికి నిర్మానుష్యంగా మారిన రోడ్డు

కాకినాడ రూరల్: ఎండలతో అల్లాడిన జనానికి వర్షం పడడంతో ఊరట వచ్చింది.. రెండు రోజులుగా ముసురు వేసి ఉండడంతో వాతావరణం చల్లగా మారింది. కాకినాడ, పరిసర ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులు పడ్డాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో పాటు పల్లపు ప్రాంతాలు బురదమయంగా మారాయి. వర్షంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.